# బేరం

భద్రయ్య చాలా రోజుల తర్వాత తన ఊరికి సంగిగూడెం వచ్చాడు. కాళ్ళకు తెల్లని రీబోక్ షూస్. నల్లని జీన్సు ప్యాంటు మీద ఎర్రని టీషర్టు - కళ్ళకు బంగారం ఫ్రేమున్న నల్లటి కళ్ళద్దాలు. భద్రయ్య వేషమే పూర్తిగా మారిపోయింది. ఇంతకు ముందు బక్కగా పీక్కపోయిన ముఖంతో నల్లగా వుండే భద్రయ్య ఇప్పుడు లావుగా తెల్లగా అయ్యాడు. ముఖం నిండైన చెంపలతో నిగనిగ లాడుతున్నది. భద్రయ్య నల్లని కళ్ళద్దాలల్లో తమ ప్రతిబింబాలను చూసుకొని పిల్లలు మురిసి పోయారు. అతని తోక విడువకుండ అతడు ఎటు పోతె అటు పోతున్నారు. భద్రయ్య చేతిలో ఆగకుండా సినిమా పాటలతో వేలాడే పెద్ద టూ-ఇన్‌వన్ ఆ పిల్లలకు పెద్ద ఆకర్షణ అయింది.

సంగిగూడెంలోని పిల్లలే గాదు యువకులు పెద్దలు కూడా భద్రయ్యను చూసి నోళ్ళు వెళ్ళ బెట్టారు.

"భద్రయ్య ఎంత అదృష్టవంతుడు! ఎట్లున్నోడు ఎట్లయిండు!" అని ఆశ్చర్యంతో అను కున్నారు.

"పట్నంలో ఏం జేస్తున్నవ్ భద్రయ్య!" అని అడిగాడు గూడెం పెద్దల్లో ఒకరు వుండ బట్టలేక.

"బేరం! - బేరం జేస్తున్న ! పట్నంలో బేరం జేస్తున్న" అని సగర్వంగా చెప్పాడు భద్రయ్య నోట్లో నములుతున్న చూయింగు గమ్‌ను అటుయిటు తిప్పుతూ. అప్పుడప్పుడు నమిలే చూయింగు గమ్‌తో నోటి బైటికి పెద్ద బుగ్గను ఊది పిల్లలను నవ్విస్తున్నాడు భద్రయ్య.

భద్రయ్య మాటిమాటికి టీషర్టు కాలరును ఒకచేత్తో పైకెత్తే తీరు యువకులను ఎంతగానో ఆకర్షించింది. ఈ గూడెంలో యువకులు ఈమధ్యనే అంగిలేసుకోవడం మొదలైంది.

వాళ్ళ తండ్రుల కాలంలో ఒంటి మీద అంగీలేసుకోవడం అరుదుగానే వుండేది. ఎప్పుడో పండుగలకో పెళ్ళిళ్ళకో అంగీలేసుకునే వాళ్ళు. లేకపోతే కింద ఒక దోతితోనే బరిబాతలనే తిరిగేవాళ్ళు. అంగీలయితే వచ్చాయి కాని ఆ గూడానికింకా టీషర్టులు రాలేదు. భద్రయ్య వేసుకున్న ఎర్రని పచ్చని టీషర్టులు ఆ ఊరి యువకుల నెంతగానో ఆకర్షించాయి.

ఆ గూడెం నుంచి ఎంతమందో పట్నంపోయారు. రిక్షా తొక్కి ఆటోలు నడిపి వచ్చారు. ఆకాశాన్నంటే మేడలు కట్టడంలో కూలీలుగా పనిచేసారు. వాళ్ళ పెళ్ళాలు పెద్దపెద్ద మేడల్లో పని మనుషులుగా పనిచేసారు. అట్లా రెండు చేతులా సంపాదించారు. గాని భద్రయ్య లాగా సంపాదించు కొచ్చిన వాళ్ళు లేరు! అని గూడెం వాళ్ళంతా వింతగా చెప్పుకున్నారు. ఎక్కడ చూసిన భద్రయ్య ముచ్చట్లే.

భద్రయ్య బతుకమ్మ పండుగ రేపనగా గూడానికి వచ్చాడు. దసరా దీపావళి పండుగలు పోయినా గూడెంలోనే వున్నాడు. ఇంతకుముందెప్పుడైనా భద్రయ్య వస్తే వారం పదిరోజులుండే వాడు. ఇట్లా నెలల కొద్ది ఎప్పుడూ వుండలేదు.

భద్రయ్య తన టూఇన్‌వన్ తీసుకుని రోజూ పొద్దుగూకిం తర్వాత గూడెం మధ్య వున్న పంచాయితీ ఆఫీసువైపు బయలుదేరుతాడు. అతని చుట్టూ యువకులు చేరుతారు. యువకులకు పొద్దంతా వ్యవసా యం పనులు చేసుకున్న తర్వాత తీరిక దొరికేది అప్పుడే. ఆ యువకులు భద్రయ్యను పట్నం ముచ్చట్లు అడుగుతారు. భద్రయ్య చెప్పే విషయాలు అవి సగం కోతలని తెలియక ఆసక్తిగా వింటారు.

భద్రయ్య తన చుట్టూ చేరిన యువకుల్లో మల్లయ్య మీద కాస్త ఎక్కువ స్నేహం చూపాడు. మల్లయ్య భుజం మీద చెయ్యేసి భద్రయ్య దగ్గరగా కూర్చునేవాడు. అందరిముందు మల్లయ్యను దగ్గరికి గుంజి "మల్లన్నా!" అని పిలిచేవాడు. అప్పుడప్పుడు సిగరెట్టు పెట్టె తీసి మల్లన్న తాగేటందుకు సిగరెట్టు ఇచ్చేవాడు. తానే జేబులోంచి టిన్‌టిన్ అని సంగీతంతో వెలిగే లైటరుతో మల్లన్న నోట్లోని సిగరెట్టును వెలిగించేవాడు. దాంతో భద్రయ్య అందరిలో తనను ప్రత్యేకంగా చూస్తున్నందుకు మల్లన్నకు గర్వం కలిగింది. తనలో యేదో ప్రత్యేకత వుంది అందుకే భద్రయ్య తనను అట్లా చూస్తున్నాడు అని అనుకొని మురిసిపోయాడు మల్లయ్య.

ఒకరోజు పొద్దున్నే ఎయిలువారంగ భద్రయ్య మల్లయ్య ఇంటికి వచ్చాడు టూఇన్‌వన్ తో. ఆరోజు మల్లయ్య ఇంకా బావి దగ్గరికి పోలేదు. అతని తండ్రి చీకటి వుండగానే లేచి బావి మోటరు చాలూ చేసి పొలానికి నీళ్ళు పెడ్తానని పోయాడు. మల్లయ్యను "పొలానికి గింత యురియ సల్లాలె! రా" అని చెప్పి వెళ్ళిపోయాడు. అందుకని మల్లయ్య ఆరోజు తండ్రి అన్నానికి ఇంటికి వచ్చేవేళకు బావి దగ్గరికి పోవాలనుకొని ఇంట్లోనే వున్నాడు.

ఇంకా తెల్లారకముందే తన వాకిలిముందు భద్రయ్యను చూసి మల్లయ్య ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.

"లోపలికి రావే భద్రన్న! గక్కడ్నే నిలబడ్డవ్!" అన్నాడు.

భద్రయ్య లోపలికి వచ్చాడు. విశాలమైన వాకిట్లో రెండు నులక మంచాలు వేసి వున్నాయి.

"కూసో భద్రన్న!" అని మంచాన్ని చూపించాడు మల్లయ్య.

భద్రయ్య అటు యిటు చూసాడు. వాకిట్లో ఒకవైపు చిన్న కొట్టం వుంది. దానిలో ఎడ్లు అయితే లేవు గాని రెండు బర్రెలున్నాయి. అప్పుడే పాలు పిండుకొని పాలచెంబుతో నడిచి వస్తున్న మల్లయ్య భార్య లచ్చి కన్పించింది భద్రయ్యకు. పొద్దున్నే చల్లగాలికి లేచే ముంగురులతో లచ్చి ముఖం ఆకుల నడుమ ముద్దబంతి పువ్వులాగా కన్పించింది అతనికి.

"అబ్బ! ఎంత ముద్దుగుంది. నేను ఇన్నది నిజమేనన్నమాట!" అనుకున్నాడు భద్రయ్య.

"నీ పెండ్లమ?" అడిగాడు భద్రయ్య మల్లయ్య నుద్దేశించి ఏమీ తెలియనట్లుగా. అతని చూపులు మాత్రం ఇంట్లోకి నడిచిపోతున్న లచ్చి మీదనే వున్నాయి.

"అబ్బ! ఎంత ఒయ్యారంగ నడిసిపోతున్నది! ఆ నడకకే లచ్చలియ్యొచ్చు" అనుకున్నాడు భద్రయ్య మనస్సులో.

లచ్చి ఇంట్లోకి వెళ్ళిపోయిం తర్వాతనే భద్రయ్య మల్లయ్యవైపు చూసాడు. కొంటెగా చిరునవ్వు నవ్వాడు. మల్లయ్య సిగ్గుపడుతూ చిరునవ్వు నవ్వి -

"నా పెండ్లం అది. పేరు లచ్చి. మొన్ననే దివిలె నోములయినంక తల్లిగారింటికాడి నుంచి ఒచ్చింది" అన్నాడు.

భద్రయ్య మల్లయ్య మాటలకు కనుబొమ్మలు పైకి ఎక్కించి పండ్లను పెదవులతో బిగబట్టి బాగుందన్నట్లు తలూపి చిరునవ్వు నవ్వాడు. "పదహారేళ్ళుంటాయన్నారు. కానీ యీ పిల్ల ఇంకా చిన్నగ కన్పిస్తున్నది!" అనుకున్నాడు భద్రయ్య మనస్సులో.

ఇంతలో మల్లయ్య తల్లి వెంకటమ్మ చీపురుతో బయటికి వచ్చింది.

"మల్లన్న ! గింత పొద్దుగాల ఎవర్రా ఒచ్చింది!" అని అడిగింది.

"మన భద్రన్న ఒచ్చిండే అమ్మ!" అన్నాడు భద్రయ్య ఖుషీగా.

"భద్రన్నా! నాయిన బాగున్నవ! పట్నంల మస్తు బేరంజేసి సంపాయిస్తున్న వంట!" అడిగింది వెంకటమ్మ.

భద్రయ్య వినయంగా చిరునవ్వు నవ్వి "ఏదో నీ దయ పెద్దమ్మ!" అన్నాడు.

"భద్రన్న! ఒక్కమాట అడ్గుత ఏమనుకోవు గద!" అంది వెంకటమ్మ సంకోచిస్తు.

"అడ్గు పెద్దమ్మ" అన్నాడు భద్రయ్య వినయంగా.

"ఏం లేదు! మా మల్లన్న పట్నం వస్తే ఏమన్న నీ లెక్క బేరం! - గదీ చేస్కునేటందుకు మోక వుంటదంటవ?" అడిగింది వెంకటమ్మ.

మల్లయ్య తల్లి మాటలు విని ఆశగా భద్రయ్యవైపు చూసాడు.

"ముసల్ది మంచిగనే అడ్గింది. నా పని అల్కనైంది!" అనుకున్నాడు భద్రయ్య మనస్సులో. సంతోషాన్ని ఆపుకోలేకపోయాడు. నవ్వుతూ "ఎందుకు మోక లేదు పెద్దమ్మ! గిప్పుడే మల్లన్నను నా యెంట తోలు. బేరం చేస్కునేదంత నేనే దగ్గరుండి నేర్పుత. ఇగ సూసుకో మల్లన్న రెండు సేతులా సంపాయిస్తడు!" అన్నాడు భద్రయ్య.

"ఎంత మంచోడివిర భద్రన్న! నువ్వు గట్ల అంటవని అనుకోలేదు నేను! నా నోట్లె వున్న మాట అన్నవ్! మా మల్లన్న నీ సేతి కింద కొన్ని దినాలు పనిజేస్తె అన్ని నేర్సుకుంటడు! గప్పుడు నీ లెక్క సొంతంగ బేరం సేసుకుంటడు!" అంది సంబరంగా వెంకటమ్మ.

"అయితె పెద్దమ్మ! మల్లన్నను నాతోటి పట్నం తోలిచ్చు. నేను ఎల్లుండే పట్నం పోతున్న!" అన్నాడు భద్రయ్య. వచ్చిన పని అయ్యాక ఆలస్యమెందకని భద్రయ్య మనసులో అనుకున్నాడు తృప్తిగా.

"గంత జల్దా!" అంది వెంకటమ్మ.

"మల్ల అనుకున్నం గదా! ఎన్క ముందెందుకాడు తున్నవ్ పెద్దమ్మ! మల్లన్నను నా సేతికింద పెట్టుకొని అంత నేర్పుత. బుగులెందుకు నీకు పెద్దమ్మ!" అడిగాడు భద్రయ్య.

"గదిగాదు భద్రన్న!" అంది వెంకటమ్మ. అప్పుడే మల్లయ్య తండ్రి సత్తెయ్య వచ్చాడు.

"ఎవరే ఒచ్చింది. పట్నం భద్రన్నా! ఏంది? ఏందే నిన్ను బుగులెందుకు అంటున్నదేందే?" అడిగాడు సత్తెయ్య.

"ఏం లేదయ్య! భద్రన్న మన మల్లన్నను పట్నం తీస్కపోయి బేరం నేర్పుతనంటున్నడు!" చెప్పింది వెంకటమ్మ. ఆమె ముఖం ఆనందంతో అలికినట్లయింది.

"గట్లనా! గట్లయితె అన్ని పోని. గిక్కడ ఎవసాయం పనులేమంత వున్నయని. నేను చేస్కుంట. పట్నంల బాగుపడితె నేను ఒద్దంటన" అన్నాడు సత్తెయ్య. సత్తెయ్యలో ఇంకా జవం ఉడుగలేదు. పదెకరాల పొలం నాగలిగట్టి ఒక్కడే దున్నగలడు.

"సరే! నేను పోత పెద్దమ్మ! మల్లన్నను పట్నం పోయేటందుకు తయారుసెయ్యి!" అన్నాడు భద్రయ్య.

వెళ్ళిపోతున్న భద్రయ్యను ఇంటి బయటిదాకా సాగనంపడానికి వెంటవెళ్ళాడు మల్లయ్య. అతని ముఖం అనుకోని నిర్ణయాలతో సంతోషంగా వెలిగిపోతున్నది.

"ఏం మల్లన్న! ఖుషీగ వుంద? పట్నంపోతనని!" అడిగాడు భద్రయ్య.

"నిజంగనే తీస్కపోతవ భద్రన్న!" సందేహంగా అడిగాడు మల్లయ్య. అతని మాటలు

అతనికి కలిగిన అదృష్టాన్ని నమ్మలేనట్లుగా వున్నాయి.

"ఏంది మల్లన్న! గట్ల మాట్లాడ్తవ్? సరేగాని నువ్వు కొత్తగ పెండ్లి అయినోనివి. మరి నీ పెండ్లాన్ని ఇడిసిపెట్టి శాన్నాళ్ళు పట్నంల వుంటవ? గది సెప్పు మొదలు!" పరిహాసంగా అంటున్నట్లుగా అన్నాడు భద్రయ్య.

మల్లయ్య సిగ్గుపడ్డాడు. చిరునవ్వు నవ్వి "గదయితె కట్టమే అనుకో! నా పెండ్లయి ఆర్నెల్లయింది. లచ్చి గిప్పుడే ఒచ్చింది! దాన్ని ఇడిసిపెట్టి వుండాలంటె" అని నసిగాడు మల్లయ్య.

"మల్లన్న నువ్వు ఏమి ఎన్క ముందాడకు. నేను అనేది గదే! నువు నీ పెండ్లాన్ని ఇడ్సిపెట్టి ఎన్నాళ్ళుంటవ్ ఒంటరిగ! గక్కడ పట్నంల మనోల్లున్నరు ఇంక. అక్కడేం కొత్త లేకుంట నీ పెండ్లం ఆల్లతోటి వుంటది. నువ్వు సింత లేకుంట బేరం నేర్సుకుంటవ్!" అన్నాడు భద్రయ్య.

"నువ్వు గట్లంటె సరే! అయిన మా అమ్మనడ్గుత" అన్నాడు మల్లయ్య.

"మల్ల మీ అమ్మనేంది అడిగేదిః నేను జెప్తున్నగద! అంత మంచిగనె వుంటది. నువ్వు జెప్పు మీ అమ్మకు లచ్చిని తీస్కపోతనని" అన్నాడు భద్రయ్య. అతని గొంతులో అసహనం చిరుకోపం ధ్వనించాయి.

భద్రయ్య కోపాన్ని పసిగట్టాడు మల్లయ్య. ఎక్కడ తనను వద్దంటాడో యేమో అని భయపడ్డాడు మల్లయ్య. అందుకే వెంటనే

"గట్లయితె సరే భద్రన్న! మా అమ్మకు సెప్త" అన్నాడు మల్లయ్య.

మల్లయ్య భార్యను కూడా పట్నం తీసుకపోతానని చెప్పినప్పుడు అతని తలిదండ్రులు వెనుకాడారు. వెంటనే ఒప్పుకోలేదు.

"గదెందుకురా!" - అన్నారు సందేహంగా.

"పట్నంల ఏం భయంలేదని భద్రన్న సెప్పిండే అమ్మ! దాన్ని తీస్కరా. గక్కడ మంచిగుంటది. పట్నంల ఇంక మనోల్లున్నరని సెప్పిండే భద్రన్న" అన్నాడు మల్లయ్య తల్లితో.

కొడుకు భార్యను తీసుకపోవడానికి పట్టుదలగా వున్నాడని తలిదండ్రులు గ్రహించి ఏమనకుండా ఊరుకున్నారు.

"ఎక్కడున్న ఆల్లు మంచిగుంటె సాలు!" అనుకున్నారు. మల్లయ్య మాటలకు ఒప్పు కున్నారు.

భద్రయ్య ముందే పట్నం వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిపోయిన రెండు రోజులకు మల్లయ్య భార్యతో పట్నం బస్సు ఎక్కాడు. వాళ్ళిద్దరు పట్నంలో బస్సు దిగగానే ఎదురుగా భద్రయ్య కన్పించాడు.

పట్నం పోతున్నానని లచ్చికి చాల సంబరంగా వుంది.

"పుట్టిన కాడ్నించి పట్నం పేరే ఇన్నగాని ఎన్నడు పట్నం ఎట్లుంటదో సూడలేదు" అంది లచ్చి మల్లయ్య పట్నం పోదామని చెప్పిన రాత్రి.

"నేనెక్కడ సూసిన!" అన్నాడు మల్లయ్య భార్యను దగ్గరకు లాక్కొని.

లచ్చి పట్నం పోతనని తన పెండ్లి చీరల్లో మంచి చీర తీసి కట్టుకున్నది. బాగా నూనె పెట్టుకొని వెంట్రుకలు దువ్వుకొని కొత్త రిబ్బన్లతో జడవేసుకున్నది. రంగురంగుల పిన్నులు పెట్టుకుంది. చెవులకు కమ్మలు కాళ్ళకు పట్టా గొలుసులు పెట్టుకుంది. తండ్రి కొని యిచ్చిన పౌడరు ముఖానికి రాసుకుంది. కళ్ళకు కాటుక పెట్టుకుంది. చక్కగా తయారయిన లచ్చి ప్రయాణంతో కాస్త అలిసిపోయినట్లు కన్పించింది భద్రయ్యకు.

"అయినా సక్కదనం ఏమి తక్కువకాలేదు. నేను యాదికి పెట్టుకున్నదానికంటె ఇంక మంచిగ కనపడ్తున్నది యీ పోరి" అనుకున్నాడు భద్రయ్య.

"ప్రయాణం బాగ జరిగింద?" అడిగాడు భద్రయ్య మల్లయ్య నుద్దేశించి. కాని అతని కళ్ళన్ని లచ్చి మీదనే వున్నాయి.

"ఆ(..... ఏం కట్టం కాలేదు. బస్సు దిగంగనె గిక్కడ నువ్వు కన్పించినవ్!" అన్నాడు మల్లయ్య. అంతా సక్రమంగా జరుగుతున్నందుకు అతనికి ఆనందంగా వుంది.

లచ్చిని మల్లయ్యను ఆటోలో తీసుకెళ్ళాడు భద్రయ్య. ఆటో వెళ్ళి వెళ్ళి ఒక చిన్న సందులో చిన్న ఇంటి ముందు ఆగింది. తోవలో పెద్ద పెద్ద మేడలు దుకాణాలు కన్పించాయి. వాటిని లచ్చీ మల్లయ్య కళ్ళన్నీ విప్పార్చి చూస్తూ కూర్చున్నారు. చివరకు ఒక చిన్న ఇంటిముందు ఆటో ఆగింది.

"ఇదే మన ఇల్లు!" అని భద్రయ్య అన్నప్పుడు వాళ్ళకు నిరాశయింది.

పట్నంల బేరం చేస్తున్న భద్రయ్య ఇల్లు పెద్దగా వుంటుందని ఊహించాడు మల్లయ్య.

వాళ్ళిద్దర్ని ఇంట్లోకి తీసుకెళ్ళాడు. ఆటో పైసలు మల్లయ్యను ఇయ్యనియ్యలేదు. భద్రయ్య. తనే ఇచ్చాడు.

లోపల రెండే అర్రలున్నాయి. ముందు అర్ర - వెనుక అర్ర. వెనుక అర్ర దాటినాక స్నానాల అర్ర, పాయిఖానా వున్నాయి.

"గీ ఇల్లు మీ కోసం కిరాయికి తీసుకున్న. బేరం బాగ సాగితె గప్పుడు మీరు ఇంక పెద్ద ఇల్లు తీస్కావచ్చు!" అన్నాడు భద్రయ్య.

ఆ రాత్రి భద్రయ్య వాళ్ళతోటే వున్నాడు. ఎక్కడ చూసినా వాళ్ళకు భద్రయ్య బట్టలు, బూట్లు తెగిపోయిన చెప్పులు ఇంట్లో కన్పించాయి.

"గీ ఇల్లు మనకోసం తీస్కున్న అంటడేంది? మరి గివన్ని ఎందుకున్నయి?" అంది

లచ్చి ఆ రాత్రి గుసగుసగా మల్లయ్యతో. లచ్చి మల్లయ్యలు వెనుక అర్రలో పడుకున్నారు. భద్రయ్య ముందు అర్రలో పడుకున్నాడు.

"ఏమోలేవే! పండుకో నిద్రొస్తున్నది" అన్నాడు మల్లయ్య. అతడు లచ్చితో ఆ విషయం మాట్లాడతలచుకోలేదు. ఎందుకంటె అదే అనుమానం అతనికీ వచ్చింది.

మర్నాడు భద్రయ్య వాళ్ళిద్దరికీ పట్నమంతా తిప్పి చూపించాడు. ఈసారి ఆటోలో కాక ట్యాక్సీలో తీసుకొని వెళ్ళాడు. ఎక్కడా వాళ్ళను పైసా ఖర్చు పెట్టనియ్యలేదు. పట్నమంతా తిరిగి అలిసిపోయి ఆ సాయంత్రం ఇంటికి వచ్చాక మల్లయ్య అడిగాడు.

"ఏంది భద్రన్న పట్నమంత సూపిస్తివి. గాని నీ బేరం జాగ సూపవైతివి!"

భద్రయ్య నవ్వాడు.

"గప్పుడే తొందరేంది మల్లన్న! రెండు రోజులాగు. సెల్లెమ్మా నువ్వు పట్నం బాగా సూడంద్రి. గా తర్వాత ఇగ నిన్ను బేరంల దింపినంక నీకు ఊపిరి పీల్సుకునే పుర్సతుండదు. గప్పుడేం సూస్తవ్ పట్నం! అని గిప్పుడే సూపిస్తున్న"

భద్రయ్య నవ్వు భద్రయ్య మాటల తీరు లచ్చికేం నచ్చడంలేదు. ఇంట్లోకి రాగానే దబ్బున వెనుక అర్రలోకి వెళ్ళిపోయింది. ఎన్నాళ్ళయిందో భద్రయ్య బట్టలుతికి. గోడకు మొలలు కట్టి వేలాడేసిన ప్యాంట్లు అంగీల నుంచి చెమట వాసనలు లేచి రెండు అర్రల నిండా నిండాయి. ఆ అర్రలకు కిటికీలు చిన్నగా వున్నాయి. గాలే ఆడడం లేదు. ఆ కంపు వాతావరణం లచ్చికేం బాగాలేదు. మంచి గాలి పీల్చుకునేటందుకు బయటికి పోదామంటె వెనుక జాగానే లేదు. ముందల పోతె రోడ్డు వున్నది. ఆ వెనుక అర్రలో లచ్చికి జెయిల్లో వేసినట్లుగా వుంది.

వచ్చినరోజు రాత్రిగాని ఆ రోజంతా గాని భద్రయ్య వంటమాటే ఎత్తలేదు. అన్నిపూటలా హోటల్లోనే తినిపించాడు. వంట చేసే బాధ లేక లచ్చికి బాగానే వుంది. కాని భద్రయ్యను చూస్తుంటె ఆమెకు భయంగా వుంది. ఆయన మాటిమాటికి "సెల్లెమ్మ! సెల్లెమ్మ!" అంటూ దగ్గరిగా రావడం భుజమో చేయో తాకడం ఆమెకు - ఓకారం కలిగిస్తున్నది. భర్త కదేం చెప్పినా అర్థం కాదని ఆమె గ్రహించింది. భద్రయ్య వాలకం మంచిగ లేకపోయినా "రెండ్రోజులు ఓపిక పడ్త. ఏం జేయాలె!" అనుకుంది లచ్చి.

ఆ మర్నాడు కూడా భద్రయ్య వాళ్ళను ట్యాక్సీలో తీసుకపోయి పట్నమంతా తిప్పాడు. పెద్దపెద్ద ఇండ్లు హోటళ్ళు చూపించాడు. ఆ రోజు మధ్యాహ్నం పెద్ద హోటల్లో భోజనం తినిపించాడు.

"మల్లన్న! గీ హోటల్ల ఒక్కొక్క అర్ర ఒక్క రోజుకు ఎంత కిరాయి వుంటదో నీకెరికేన?" అని అడిగాడు భద్రయ్య సగర్వంగా.

"నాకేమెరుక! ఎంతుంటదేంది?" అడిగాడు మల్లయ్య. అతనిక్కూడా భద్రయ్య ఈ తిప్పటం పైసలు ఖర్చుపెట్టడం మంచిగనిపిస్తలేదు.

"ఒక్కలు పండుకునే అర్ర ఒక్కరోజుకు రెండువేల ఐదొందలుంటది. ఇగ ఇద్దరు పండుకునె అర్రయితె మూడువేలుంటది" అని చెప్పాడు.

లచ్చి మల్లయ్యలు నోళ్ళు వెళ్ళబెట్టి అదంతా అబద్ధమన్నట్లుగా భద్రయ్యవైపు చూసారు.

"గన్ని పైసలా? గదేంది భద్రన్న గంతెందుకుంటది? గా పైసలు పెడ్తె మాకు దున్నెటం దుకు మంచి ఎద్దుల జోడ ఒస్తది!" అన్నాడు మల్లన్న ఆశ్చర్యం దాచుకోకుండ. ఈసారి పొలం దున్నడానికి ఎద్దుల్లేక కిరాయి నాగండ్లు పెట్టి దున్నించవలసి వచ్చింది. అది అతని మనస్సులో మెదులుతున్నది.

"మాకే ఎడ్లుంటె గీ కర్సుండేది కాదు. ఎడ్లుంటె నేను వుత్తగనే వున్న. కిరాయికి నాగలి తోలుకుంటె గిన్న పైసలు ఒచ్చేయి" మనస్సులో అనుకుంటు ఊహల్లోకి వెళ్ళిపోయాడు మల్లయ్య.

మూడోరోజు పొద్దున నర్సయ్య హోటల్ నుంచి ప్యాక్ చేసి దోసెలు ఇడ్లీలు తెచ్చాడు. "మల్లన్న బాగ తినుండ్రి. మల్ల ఆకలయితది. ఇయ్యాల బేరం జాగకు తీస్కపోత" అన్నాడు.

మల్లయ్యకు ఖుషీ అయింది. కాని లచ్చి దిగాలుపడిపోయింది.

"నేనెట్ల! ఒక్కదాన్నె ఎట్లుండాలె?" అంది జంకుతూ.

మల్లయ్య మాట్లాడకముందే భద్రయ్య అన్నాడు "సెల్లెమ్మ! ఇయ్యాల నువ్వు కూడ మాతోటి రా! ఏం బుగులుపడకు"

"గదెందుకు ? గదెక్కడికి భద్రన్న!" మల్లయ్య చిరాకుగా అన్నాడు.

"రానీ! నేను జెప్తగద!" అన్నాడు భద్రయ్య. అతడు వెళ్ళి ఆటో తెచ్చాడు. ముగ్గురూ ఆటోలో బయలుదేరారు.

"మల్ల ఆటో ఎందుకు నడిసిపోదుంగద" అన్నాడు మల్లయ్య. అతని గొంతులో మళ్ళా చిరాకు ధ్వనించింది.

"మొదటిరోజు నడకెందుకు మల్లన్న! ఒకరోజు బాట తెలిసినంక నడిసే పోదువులే! జాగ చాన దూరముంది" అన్నాడు భద్రయ్య. ఆటో డ్రైవరుకు భద్రయ్య ఏం చెప్పాడో లచ్చి మల్లయ్యలు వినలేదు. ఆటో పెద్ద రోడ్డు దాటి చాలాదూరం పోయింది. వేగంగా సందులు గొందులు దాటి ఒక గల్లీలో ఒక పెద్ద ఇంటి ముందాగింది. వాళ్ళు ఆటోలో నుంచి దిగారు. ఎప్పటిలాగానే భద్రయ్య ఆటో పైసలిచ్చాడు.

భద్రయ్య ఇంటి ముందు తలుపు తోసుకొని లోపలికెళ్లాడు. లచ్చి మల్లయ్యలు

అతన్ని అనుసరించారు.

తలుపు తోసుకొని లోపలికెళ్ళగానే షాబాదు బండలు పరిచిన ఖాళీ జాగా - ఎదురుగా పెద్ద బంగ్ల కన్పించింది.

"మన ఊర్లె లెక్క అలుకు ముగ్గు లేదిక్కడ" అనుకుంది లచ్చి. అత్తగారింట్లో పెద్దవాకిలి అత్త తను కలిసి ఊడ్చి సాన్పి సల్లి ముగ్గులు పెట్టడం యాదికి వచ్చింది లచ్చికి.

వాకిట్లో అటుయిటు తిరుగుతు చాలామంది ఆడవాళ్ళు కన్పించారు. బంగ్లలోకి పోతె ఇల్లు ఎన్నో అర్రలతో కన్పించింది.

"అబ్బో! ఎన్ని అర్రలున్నయి!" మనసులోనే ఆశ్చర్యపోయింది లచ్చి.

ఎక్కడ చూసినా ఆడవాళ్ళే!

ఆ ఆడవాళ్ళు వాళ్ళ బట్టలతీరు లచ్చికేమి మంచిగనిపించలేదు. ఏదో రాగూడని స్థలానికి వచ్చినట్లుగా ఆమెకు అనుభవమైంది. ఒళ్ళు గగుర్పొడిచింది.

"ఎక్కడికి తీసుకొచ్చినవయ్యా!" అంది లచ్చి భర్తతో భయంగా అతనికి దగ్గరగా జరిగి -

మల్లయ్యకు ఆ జాగా అయోమయంగానే వుంది.

భద్రయ్య ముందున్న హాలుదాటి లోపలికెళ్ళాడు. వాళ్ళను వెంటరమ్మని చేయూపాడు. లోపల ఒక పెద్దావిడ జరీ అంచులతో మెరుస్తున్న నైలాన్ చీర కట్టుకొని బల్లమీద కూర్చొని పాన్ నములుతూ కన్పించింది.

భద్రయ్య ఆమెకు దగ్గరగా వెళ్ళాడు.

"మాల్ తెచ్చిన మ్యాడమ్!" అన్నాడు.

"ఓ నువ్వా భద్రయ్య. చాలారోజులు పోయినవు?" అంది ఆమె. ఆమె నోట్లోంచి పొగాకు వాసన వ్యాపించింది అంతటా. ఆమె పాన్ పొగాకు నమలడంతో గారపట్టిన పళ్ళు లచ్చికి అసహ్యంగా కన్పించాయి. ఆమె చీర కూర్చున్నతీరూ కూడా పసందుకాలేదు లచ్చికి.

"మాల్ తెచ్చిన అంటడేంది భద్రయ్య గామెతో" అనుకుంది లచ్చి. ఆమెకెందుకో గుండె దడదడ కొట్టుకుంది.

అదంతా మల్లయ్య పరేషానయి చూస్తున్నాడు. "మాల్ తెచ్చిన అంటున్నడేంది భద్రన్న! గాయన గీమెతోటె బేరం చేస్తడ ఏంది? ఏం బేరం చేస్తడు?" అన్న ఆలోచనతో మల్లయ్యా తలకాయ గిర్రున తిరుగుతున్నది.

ఆ గారపండ్లామె లచ్చివైపు ఎగాదిగా చూసింది. ఆమె చూపులు లచ్చికసలే మంచిగనిపించలేదు! "మాల్ మంచిగనే వుంది!" మెచ్చుకున్నట్లుగా తలూపింది ఆ గారపండ్లావిడ. ఆమె పక్కనే వున్న అర్రలోకి పోయింది. ఆమె వెనుకనే భద్రయ్య వెళ్ళాడు. లోపల వాళ్ళిద్దరు

ఏదో మాట్లాడుకుంటున్న ధ్వనులు వినిపించాయి లచ్చి మల్లయ్యలకు.

"ఓ! భద్రన్న బేరం మాట్లాడుతుండు" అనుకొని మల్లయ్య మనస్సు కుదుటపడింది.

లచ్చికి ఆ వాతావరణం నుంచి పారిపోవాలనిపిస్తున్నది. భర్తనంటుకొని నిలబడింది భయంతో. పదివేలు - ఇరవైవేలు అని గారపండ్లావిడ మాటలు వాళ్ళకు వినిపించాయి.

"గా పొల్ల మీద లచ్చ అయిన సంపాయిస్తవ్! ఇరవైవేలేంది ముప్పై అయిన నాకు ముట్ట జెప్పాలె! లేకపోతె" - అని బెదిరిస్తున్నట్లుగా అన్న భద్రయ్య మాటలు వినిపించాయి.

సరే! సరే! అన్ని దర లెక్కినయని గీ దర కూడ ఎక్కిస్తున్నవ భద్రన్న? పోనీ నీ మాటెందుకు కాదనాలె!" అన్నది గారపండ్లామె.

ఆ తర్వాత చాలాసేపటికి భద్రయ్య బయటికి వచ్చాడు. అతని రెండు ప్యాంటు జేబులు వుబ్బి వున్నాయి.

"భద్రన్న మంచి బేరమే చేసినట్లున్నడు!" ఖుషీ అయ్యాడు మల్లయ్య.

భద్రయ్య బయటికి వస్తూనే -

"పద మల్లన్న! సెల్లెమ్మను గిక్కడ్నే వుండనియ్యి రెండ్రోజులుంటది. మన అక్క" - అని గారపండ్లామె వైపు చూపించి -

"మన సెల్లెమ్మకు పట్నం సంగతంత నేర్పుతది. ఇంతల నేను నీకు బేరం సంగతి చెప్త - సరేనా!" అన్నాడు.

మల్లయ్య ఏం మాట్లాడకముందే భద్రయ్య లచ్చివైపు తిరిగాడు.

"సెల్లెమ్మ! నువ్విక్కడ్నే వుండు. మేము మల్లొస్తం. నిన్ను తీస్కపోతం. గంత దనుక నువ్విక్కడ్నే వుండు. సరేనా! బుగులుపడే అక్కర్లేదు. మంచిగుండు. అక్క నిన్ను మంచిగ సూసుకుంటది. సరేనా!" అని భద్రయ్య మల్లయ్య చెయ్యి పట్టుకొని బరబరా ఈడ్చుకొని బయటికి గుంజుకొని పోయాడు.

ఎదురుగా ఆటో కన్పిస్తే దానిలో మల్లయ్యను కూర్చోబెట్టి తనూ కూర్చున్నాడు. ఆటో గల్లీలన్ని దాటి పెద్దరోడ్డు ఎక్కింది. చక్కంగా బస్సుస్టాండుకు పోయి ఆగింది.

"ఏంది భద్రన్న! గిక్కడికి తెచ్చినవ్!" అడిగాడు బస్సులవైపు చూస్తు మల్లయ్య.

"బేరం అయిపోయిందిగద! నువ్వు ఊరికి పో!" అన్నాడు భద్రయ్య.

"బేరమైంద!" కనుగుడ్లు వెళ్ళబెట్టాడు మల్లయ్య.

భద్రయ్య ప్యాంటు జేబులోంచి నోట్లకట్టలు తీసి మల్లయ్య చేతిలో పెట్టాడు. "ఈ మూడు వేలు వుంచుకో. ఊరికిపోయి దున్నేటందుకు ఎడ్లు లేవన్నవ్ గద - రెండెడ్లు కొనుక్కో ఈ పైసలు పెట్టి" అన్నాడు భద్రయ్య.

"మూడు వేలా?" ఆశ్చర్యపోయాడు మల్లయ్య.

"ఏం జేయను మల్లన్న. నేనెంత కోషిష్ చేసిన నువ్వు జూసినవ్ గద. ఆ ముండ ఐదువేలే ఇచ్చింది లచ్చికి. రెండు వేలు నేను ఇన్ని రోజులయిన కర్సుకుంచుకున్న మూడువేలు నీకిచ్చిన" అన్నాడు భద్రయ్య.

"ఏంది భద్రన్న! నా పెండ్లాన్ని అమ్మినవ ఏంది గా గారపండ్లదానికి?" కోపంగా అన్నాడు మల్లయ్య.

"గంత కోపమెందుకే మల్లన్న! పెండ్లం పోతె మల్ల పెండ్లం ఒస్తది. మల్ల నీకు కట్నమిచ్చి పొల్లనిస్తరు. నువ్వురంది పడకు మల్లన్న. పో! ఊరికి పోయి లచ్చి ఎవనితోనో లేచిపోయిందని చెప్పు అందరికి - గంతే!" అని భద్రయ్య మల్లయ్యను కదులుతున్న బస్సులోకి ఎక్కించాడు. కదిలే బస్సులో కట్టె చరచుకొని కూర్చుండిపోయాడు మల్లయ్య. వలవల ఏడ్చే లచ్చి అతని కళ్ళముందు కన్పించింది.

"లచ్చి పట్నంల ఏ సందుగొందుల్లో వుందో నాకైతె ఎర్కలేదు. నేనేం జేయాలె గిప్పుడు నా చేతుల్లో ఏం లేదు!" అని నిస్సహాయంగా అనుకున్నాడు మల్లయ్య. "భద్రన్న చెప్పిందే చెప్త అందరికి" అనుకున్నాడు. అతని చేతులు నోట్లకట్ల మీద బిగుసుకపోయాయి. లచ్చి స్థానంలో అతనికిప్పుడు బలిసిన రెండెడ్లు కన్పించాయి. కళ్ళు మెరిసాయి.

* * *